# సత్యవాక్కు

క్రైస్తవ మాస పత్రిక



THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు-మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!


**SATYA VANI**

(P.O. Box 80) Seshagiri Rao St.

KAKINADA-533 004


గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవుసరం!!


రాజన్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

**P.O. Box 80, KAKINADA, A.P. 533 001**

Editor :
J C. CHOATE

Managing Editor :
JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 9 | మే 1989 | సంచిక 10


## సంపాదకీయము

### అత్యుత్తమమైన దానికొరకు అన్వేషణ

*(Striving for Excellence)*

మనం ఇతరుల స్థితిగతులు అర్థంచేసికొనని యుగంలోను స్వార్థపరమైన యుగంలో జీవిస్తున్నాము. ఖరీదులు పెరిగినను నాణ్యత మాత్రం లోపిస్తున్నది. చేసిన కార్యాలలో తృప్తి కనిపించుటలేదు. స్థాయి తగ్గి నిరుద్యోగ సమస్య విపరీతంగా పెరిగిపోవుచున్నది. అనేకుల జీవితాలలో హింస దౌర్జన్యం చోటు చేసికొన్నాయి. లంచగొండితనం విస్తరించింది. మనం ఎట్టి ప్రపంచంలో జీవిస్తున్నామో! ఇది మన పిల్లల కివ్వగలిగేది ఏమిటి ?

ప్రపంచ మంతా ఈ విషయాలే మనం చూడగలుగుచున్నాము. క్రైస్తవ జీవితం మంచిని కోరేవారికి ప్రత్యామ్నాయం యివ్వడానికి సిద్ధంగా ఉన్నది. మంచి జీవితాన్ని, మంచి సమయాన్ని మరియు మంచి పనిని క్రైస్తవ్యం యివ్వగలుగుతుంది. క్రైస్తవుడు అవకాశవాదికాడు. అతడు శ్రద్ధగా పనిచేస్తాడు. తనుచేసే పనిలో తనశక్తిని

ధారబోస్తాడు అంతేగాక ఎక్కువ సమయాన్ని తనపనిలో ఉపయోగిస్తాడు.

క్రైస్తవుడు క్రైస్తవుడే, ఎందుకనగా అతనిది మార్పు నొందిన జీవితం. అతడు పాపముల విషయమై మారుమనస్సు నొంది నూతన మార్గంలో నడవడాని కుపక్రమించినవాడు. అతడు ప్రభువునకు విధేయుడైనవాడై, పాపక్షమాపణ పొంది, ఈ మార్గంలో తిరిగి జన్మించి నూతన జీవితాన్ని జీవిస్తున్నవాడు. అతన్ని దీవించడానికి ప్రభువు ఉన్నాడు, తనకు ప్రోత్సాహమిచ్చే దేవుని ప్రజలున్నారు. నిజమే, లోకం అతనిని సవాలు చేస్తున్నది. అతడు ముందుకు వేసే ప్రతి అడుగు అతని కవాతులో ఒక విజయంగానే భావిస్తున్నాడు.

క్రైస్తవుడు ఎల్లప్పుడు తన జీవితాన్ని మంచిగా మలచుకొనే ప్రయత్నంలోనే ఉంటాడు. తనచుట్టూ ఉన్న వారికి సహాయం చెయ్యాలని కోరుకుంటాడు. తన స్నేహితులకు మాదిరిగానుండి వారు కూడ తనను వెంబడించునట్లు ప్రోత్సాహపరుస్తాడు. తరువాత అతడు బోధించి వారు వచ్చి విషయాలు గ్రహించునట్లు వారి యెడల శ్రద్ధ కలిగియుంటాడు.

ప్రపంచము క్రైస్తవుని సవాలు చేయుచున్నది. ప్రపంచంలో ప్రతి ఒక్కరికి క్రీస్తు అవుసరం. యితరులు క్రీస్తును గూర్చి తెలిసికొనునట్లు వారి యొద్దకు సువార్తను తీసికొని వెళ్ళే ప్రయత్నము చేయాలని అతడెరిగియున్నాడు. అతడు ప్రారంభించి, మంచి చేయడం కొరకు అనేక తరుణాలు లభ్యమగుచున్నాయి. అతడు చేసిన పనినిబట్టి అతడే ఆశ్చర్యపడుచున్నాడు.

క్రీస్తు సువార్తను ప్రకటించుట, ఆత్మలు ప్రభువునకు లోబడుట క్రైస్తవునికి గొప్ప సంతోషకరమైన అనుభవము. జీవితాలు మార్చబడుచున్నాయి. ప్రపంచ మంతటా మంచికొరకు అనేక ఆత్మలు

మార్చబడుచున్నాయి. క్రైస్తవుని ప్రయత్నాల ద్వారా ఈతరంలో మంచి మార్పు కలుగుచున్నది.

క్రీస్తు మన మాదిరి. మన గురి పరలోకము. ఎవరైనా, ఎట్టి వాడైనా అతడు క్రీస్తుతో నడవాలి. అప్పుడు పరలోకము అతని స్వగృహము. ఈ లోకంలో అతడు ఉన్నవాడైనా లేనివాడైనా తరువాత దానితో ఏమి పని ?

నా స్నేహితుడా, జీవితంలో నీ గురి ఏమిటి ? ఉద్యోగమా, వాహనమా, కుటుంబమా, సంపదా, పెద్ద జీతమా, డిగ్రీ లేక ఏమిటి? చాలామంది ఈలోక విషయాలనే గురి కలిగియున్నారు. అవి వారిని రక్షించలేవు. నీవు దేవుని యెదుట నిలువబడి నీవు జీవించిన మార్గాన్ని గురించి జవాబు చెప్పవలసి యున్నది. ఈ విషయాలన్నియు వ్యర్థము. నీవు చేసిన పనుల విషయంలో ప్రభువుకు లెక్క అప్పగించవలసి యున్నది. ఉన్నతమైన వాటికి గురిపెట్టడానికి ఉన్నతమైన గురి కావలె నని నేను మిమ్ములను కోరుచున్నాను. అత్యుత్తమైన వాటిని అన్వే షించండి. దేవునిని కలిసికొనుటకు సిద్ధపడండి.

---

## కోపపడుడి, గాని ....

## (*Be angry, but...*)

కోపం మానవ సహజలక్షణం, స్వాభావిక గుణం (inborn drive). ఎంత సహనం సాత్వికం వహించినా ఒక్కొక్కసారి కోపానికి లోనవటం పరిపాటి. కోపంయొక్క తీవ్రతనుబట్టి ఆగ్రహం, రౌద్రం, ఉగ్రత యని అంటాము.

### కోపం పర్యవసానం

"కోపిష్టి కలహం రేపును; ముంగోపి అధికమైన దుష్క్రియలు చేయును" (సామెతలు 29:22). "రాయి బరువు; ఇసుక భారము;

మూర్ఖుని కోపము ఆ రెండింటికంటె బరువు. క్రోధము క్రూరమైనది; కోపము వరదవలె పొర్లునది; కోపముఎదుట ఎవడు నిలువగలడు?" (సామెతలు 27 : 3, 4). ఈ లేఖనాల్లో కోపిష్టి, ముంగోపి, మూర్ఖుని కోపమునుగూర్చి వివరించబడింది.

కోపం క్రియాత్మకమైతే దాని ఫలితం అతి దారుణముగా యుంటుంది : "కాబట్టి కయీనుకు మిక్కిలి కోపం వచ్చింది .. " (ఆది 4 : 5). తొలి నరహత్యకు కారణం కోపం. కనుక కయీను వలె ఖూనీ చేయటానికి కూడ వెనుకాడదు (ఆది 4 : 5-8). ప్రవక్తయైన ఎలీషా వాక్కు ఖాతరు చేయక రౌద్రుడైన సిరియా సైన్యాధిపతి వలె పొందవల్సిన ఉపకారం పొందకుండ చేస్తాది (2 దిన 26 : 19). కోపోద్రేకపు పర్యవసనానికి ఉదహరణలు కోకొల్లలు.

## సమస్యకు ఐదు చిట్కాలు

కోపం యొక్క స్థాయి, తీవ్రత మారే కొలది దాని పరిణామాలు కూడ ఘోరంగా మారుచుంటాయి. కోపపడటం తప్పనపుడు ఈ క్రింది 5 లేఖన సూత్రాలు పాటిస్తే సమస్య పరిష్కారమౌతుంది.

## 1. పాపం చేయకండి :

"కోపపడుడి గాని పాపము చేయకుడి" (ఎఫెసీ 4 : 26). యేసు- "వారి హృదయ కాఠిన్యానికి దుఃఖపడి, కోపముతో కలయజూచి.. " (మార్కు 3 : 5), "యేసు అది చూచి కోపపడి..." (మార్కు 10:14) యనే లేఖనాలు క్రీస్తు కోపపడినట్లు చెబుతున్నవే గాని ఆయన పాపం చేసినట్లు లేదు. సరిగదా ఆ రెండు సందర్భాల్లో ఆయన యితరులకు మేలు చేశాడు. "... ఆయన ప్రతిదినం కోపపడు దేవుడు" (కీర్తన 7 : 11).

## 2. విషార్కరణముగా కోపపడవద్దు :

"తన సహోదరుని మీద కోపపడు ప్రతివాడు విమర్శకు లోనగును" (మత్తయి 5 : 22). ఇది ఎఫెసీ 4 : 26 కు విరుద్ధముగా కన్పిస్తున్నది. గాని మత్తయి 5 : 22 పాదదీపికలో (Footnote) కమనిస్తే నిర్నిమిత్తముగా యని ఉంది. నిర్నిమిత్తముగా (Without a cause_KJV) అంటే అకారణముగా లేక కారణం లేకుండా కోపపడరాదని భావము.

## 3. నిల్వయుంచుకోవద్దు :

"... సూర్యుడస్తమించు వరకు మీ కోపము నిలిచియుండకూడదు; అపవాదికి చోటియ్యకుడి" (ఎఫెసీ 4:26, 27). "బుద్ధిహీనుల అంతరింద్రియముల యందు కోపము సుఖ నివాసము చేయును" (ప్రసంగి 7 : 9). గాని "తెలివి గలవాని హృదయమందు జ్ఞానము సుఖ నివాసము చేయును" (సామె 14 : 33).

## 4. నిదానించు :

"... ప్రతి మనుష్యుడు ... కోపించుటకు నిదానించువాడై యుండవలెను. ఎందుకనగా నరుని కోపము దేవుని నీతిని నెరవేర్చదు" (యాకోబు 1 : 19,20). "అత్రపడి కోపపడవద్దు..." (ప్రసంగి 7: 29). "ప్రేమ ... త్వరగా కోపపడదు" (1 కొరింథీ 13 : 5).

## 5. అణచుకో :

"జ్ఞానము గలవాడు కోపము అణచుకొని దానిని చూపకుండును. బుద్ధిహీనుడు తన కోపమంత కనుపరచును" (సామె 29:10). "మృదువైన మాట క్రోధమును చల్లార్చును, నొప్పించు మాట కోపమును రేపును" (సామె 15 : 1).

## హెచ్చరికలు

1. "కోపము మానుము, క్రోధము విడిచి పెట్టుము ... అది కీడుకే కారణము" (కీర్తన 37 : 8). కోపము, క్రోధము కొనసాగితే పగ పెరిగి ప్రతీకారమునకు పరుగెడతాడు; పైగా శారీరక మానసిక రుగ్మతలకు దారి తీస్తాది; లౌకిక పరమైన శిక్షలకు గురిచేస్తాది; ఆధ్యాత్మిక జీవితానికి అంతరాయం కల్గుతాది.

2. "కోపచిత్తునితో సహవాసం చేయకుము క్రోధము గల వానితో పరిచయము కలిగియుండకుము; నీవు వాని మార్గములను అనుసరించి నీ ప్రాణమునకు ఉరి తెచ్చుకొందువేమో" (సామె 22 : 24, 25).

3. నీవు ఉద్యోగివైతే "ఏలువాడు నీ మీద కోపపడిన యెడల నీ ఉద్యోగము నుండి తొలగిపోకుము; ఓర్పు గొప్ప ద్రోహ కార్యములు జరుగకుండ చేయును" (ప్రసంగి 10:4).

### సారాంశము

గనుక అకారణముగా కోపపడరాదు; కోపపడినను పాపం చేయకూడదు; కోపాన్ని నిల్వయుంచుకోరాదు; ఆత్రపడి కోపపడకూడదు; కోపపడటానికి నిదానించాలి; కోపాన్ని రేపక మృదు భాషణతో చల్లార్చాలి; లోనైతే అణచుకోవాలి.

ఈ సందర్భములో పౌలు సూచించిన దివ్యసూత్రము తిరుగులేని విరుగుడు (remedy) : "సమస్తమైన ... ... కోపము, క్రోధము ... ... మీరు విసర్జించుడి. ఒకని యెడల ఒకడు దయగలిగి కరుణా హృదయులై క్రీస్తునందు దేవుడు మిమ్మును క్షమించిన ప్రకారము మీరును ఒకరి నొకడు క్షమించుడి" (ఎఫెసి 4 : 31, 32).

— ప్రభుదాసు సబ్బతి, నిజామాబాదు.

# ప్రభువుదినమా లేక సబ్బాతు దినమా?

—వి.యి. హోవర్డు.

( గత సంచిక తరువాయి )

## అభ్యంతరములు

నేడు సబ్బాతును ఆచరించేవారు (Sabbatarians) పాత నిబంధన కాలంలో యివ్వబడిన సబ్బాతును ప్రాముఖ్యముగా యెంచుకొని క్రొత్తనిబంధన కాలంలో యివ్వబడిన ప్రభువుదినం విషయంలో అభ్యంతరాలు చెప్పుచున్నారు.

అభ్యంతరం 1: సబ్బాతు నిత్యమైనది తరతరములకును ఉండునట్టిది. అందుకే ప్రవక్త ఇట్లు తెలియజేసాడు. "ప్రతి అమావాస్య దినమునను ప్రతి విశ్రాంతి దినమునను నా సన్నిధిని మ్రొక్కుటకై సమస్త శరీరులు వచ్చెదరు" (యెష 66:23).

ఇది ప్రవక్త చెప్పిన విషయాన్ని అపార్థము చేసికొనుటయే. ఈ వచన ప్రకారము సబ్బాతు నిత్యమైనదైతే అమావాస్య పండుగ (Fast of the New Moon) కూడ నిత్యమైనదే. అయితే సబ్బాతు నాచరించేవారు దీనిని తిరస్కరించుచున్నారు. ఇదెట్లు క్రమము?

క్రొత్త నిబంధన అమావాస్యను, సబ్బాతు దిన ఆరాధనను వ్యతిరేకించుచున్నది.

"కాబట్టి అన్నపానముల విషయములోనైనను పండుగ అమావాస్య విశ్రాంతి దినములను వాటి విషయములోనైనను, మీకు తీర్పు తీర్చ నెవనికిని అవకాశమియ్యకుడి" (కొలస్స 2:16).

పండుగ అమావాస్యలు "రాబోవు విషయముల ఛాయ" యని ఆత్మావేశముతో అపొస్తలుడు విషయాన్ని ముగించెను. క్రైస్తవులు ఆశ్చర్యకరమైన క్రొత్తనిబంధన వెలుగులోనే కాని ఛాయలో నడువ కూడదు. ధర్మశాస్త్రము నిర్గమ 31:16 లో చెప్పినట్లు నిత్యమైన ఆజ్ఞ

మైతే నిర్గ 40:15 లో చెప్పబడినట్లు యాజకత్వముకూడ నిత్యమైనదే. అయితే యాజకత్వపు కర్మాన్ని ఎందుకు కొనసాగించుటలేదు?

నిర్గమ 31:16 ను పరిశీలిద్దాం. "ఇశ్రాయేలీయులు తమ తరతరములకు విశ్రాంతి దినాచారమును అనుసరించి ఆ దినము నాచరింపవలెను". దేవుడు తరతరములకు ఈ చట్టము అమలులో నుండునను ఈ మాట "వారి తరతరములకు" అనగా ఇశ్రాయేలీయుల చట్టము అమలులో నున్నంత కాలము ఉండును.

సబ్బాతు దినాన క్రైస్తవులు కూడుకొనవలెనని క్రీస్తుగాని అపొస్తలులుగాని క్రొత్త నిబంధనలో ఒక్క మాటయినను చెప్పలేదు. క్రీస్తు ఒక క్రొత్త దినాన్ని, ప్రభువు దినాన్ని అంటే ఆదివారాన్ని క్రైస్తవులకిచ్చాడు. సబ్బాతు నాచరించాలని పోరాడేవారు క్రీస్తులోనికి మార్పు చెందలేదనేది స్పష్టమైన విషయం. వారు బబులోనులో నివసించుచు సృష్టియొక్క జ్ఞాపకముగానున్న విశ్రాంతి దినమును ఆచరించుచు, పునరుత్థానమునకు జ్ఞాపకముగానున్న ఆదివారాన్ని మరచిపోవుచున్నారు.

అభ్యంతరం 2 : క్రీస్తు సబ్బాతును ఆచరించెను (లూకా 4:14-16). క్రీస్తు సబ్బాతును ఆచరించడం నిజమే. కాని మనం ఇప్పుడు దానిని ఆచరించడానికి మాదిరిగామాత్రం కాదు. ఆయన ధర్మశాస్త్రం బ్రతికియుండు కాలంలో జన్మించాడు (గలతి 4:4). ఆకాలంలో అమలులోనున్న ధర్మశాస్త్రాన్ని చనిపోవువరకు నెరవేర్చెను. ఆయన సబ్బాతును ఆచరించడం మాత్రమే కాదు, సున్నతి కూడ పొందెను (లూకా 2:21).

క్రైస్తవులు సబ్బాతును ఆచరించాలని ఆజ్ఞాపింపబడినట్లయితే సున్నతి కూడ పొందవలసియున్నది. ఇదెంత అబద్ధసిద్ధాంతము !

అభ్యంతరం 3. క్రొత్తనిబంధన సబ్బాతు నాచరించాలని ఆజ్ఞాపించుచున్నది. "కాబట్టి దేవుని ప్రజలకు విశ్రాంతి నిలిచియున్నది" హెబ్రీ 4 : 9.

ఇది దేవుని వాక్యాన్ని అపార్థం చేసికొనుట మాత్రమే. ఈ సందర్భము క్రైస్తవులకు "విశ్రాంతి దినము"ను గూర్చి చెప్పలేదు గాని పరలోక సంబంధమైన విశ్రాంతిని గూర్చి చెప్పబడినది. హెబ్రీ 4 : 1-11 వరకు చదవండి.

అభ్యంతరం 4. పౌలు సబ్బాతు దినమున సమాజ మందిర ములలో బోధించెను. ఇది క్రొత్తనిబంధనలో సబ్బాతు నాచరించి రనుటకు నిదర్శనము (అపొ. కా. 13 : 14-44, 16 : 13-14)

పౌలు సమాజ మందిరములలో సబ్బాతు దినమున బోధించెను. ఎందుకనగా యూదులను ధర్మశాస్త్రము యొద్దనుండి క్రొత్తనిబంధన యొద్దకు నడిపించుటకును, మోషే యొద్దనుండి క్రీస్తు నొద్దకు నడిపించు టకును సబ్బాతు దినాన సమాజ మందిరములో బోధించాడు. యూదు లకు క్రీస్తు సువార్తను ప్రకటించడానికి వచ్చిన అవకాశాలను ఆయన వినియోగించుకొనెను. గాని ధర్మశాస్త్ర విధులను అక్కడ బోధించ లేదు. నిజానికి అతడు చేసిన క్రీస్తుబోధ ధర్మశాస్త్రానికి విరోధమైనది. ఈ విషయాన్ని యూదులు అంగీకరించిరి. "యూదులు జనసమూహ ములను చూచి మత్సరముతో నిండుకొని దూషించుచు, పౌలు చెప్పిన వాటికి అడ్డము చెప్పిరి" అ.కా 13 : 45. పౌలు బోధ ఆచరణ సబ్బాతు దిన ఆరాధనను ధర్మశాస్త్రానికి వ్యతిరిక్తముగా నుండుట చేత చాలా మంది యూదులు హింసాత్మకముగా పౌలును వ్యతిరేకించి "భూలోకమును తలక్రిందు చేసిన వీరు ఇక్కడికి కూడ వచ్చియున్నా రని" కేకలు వేసిరి. అ. కా. 17 : 6.

పౌలు శనివారం సువార్త ప్రకటించెను. కనుక అతడు సబ్బా తును ఆచరించెనని అర్థం కాదు. శుక్రవారం సువార్త ప్రకటించినపుడు అది పరిశుద్ధ దినంగా ఆచరించడం జరిగిందని అనలేము. పౌలు ప్రతి దినము కొన్నిచోట్ల క్రొత్తనిబంధనలో వ్రాయబడిన సువార్త ప్రక

టించెను. రెండు సంవత్సరములు "తురన్ను అను ఒకని పాఠశాలలో" ప్రతిదినము బోధించెను. అపొ. కా. 19 : 9.

అభ్యంతరం 5. ధర్మశాస్త్రంలో రెండు భాగాలున్నాయని ఒకటి నీతి ధర్మశాస్త్రము (Moral Law) రెండవది విధిరూపకమైన ధర్మశాస్త్రం (Ceremonial Law). ఈ రెండింటికీ వ్యత్యాసమున్నది. విధిరూపకమైన ధర్మశాస్త్రం మనకు వ్యతిరేకముగా నున్నది. పది ఆజ్ఞలు నీతిచట్టం గనుక అది మనకు వ్యతిరేకముగాను విరోధముగాను లేదు కనుక అది రద్దుకాలేదు.

ఈ విషయం బైబిలు బోధకు భిన్నముగా నున్నది. నీతిచట్టమని, విధిరూపకమైన చట్టమని ఈ రెండు చట్టాలేమిటో బైబిలునకు తెలియదు. ఒకే ఒక చట్టమున్నది. "యెహోవా ధర్మశాస్త్రమందు వ్రాయబడియున్న విధినిబట్టి జరుగు ఉదయాస్తమయముల దహన బలులను విశ్రాంతి దినములకును అమావాస్యలకును నియామక కాలములకును ఏర్పడియున్న దహన బలులను అర్పించుటకై..." II దిన 31 : 3.

మలాకీ ఇట్లు చెప్పుచున్నాడు. "హోరేబు కొండ మీద ఇశ్రాయేలీయులందరికొరకై నేను నా సేవకుడైన మోషేకు ఆజ్ఞాపించిన ధర్మశాస్త్రమును దాని కట్టడలను విధులను జ్ఞాపకము చేసికొనుడి" మలాకీ 4 : 4.

"ధర్మశాస్త్ర గ్రంథము"లో పది ఆజ్ఞలు రెండుచోట్ల వ్రాయబడినవి. నిర్గమ 20 : 1-17 ద్వితీ 5 : 6-22 చదవండి.

"యెహోవా యొక్క ధర్మశాస్త్రం"లో నీతి ధర్మశాస్త్రము, విధిరూపకమైన ధర్మశాస్త్రము ఈ రెండు ఉన్నాయి. 2 దిన 31 : 3; లేవీ 19 : 1-37; మత్త 26 : 36-40. నీతి విధులు, సూత్రములు పరిశుద్ధమైనవి అవి యూదులకు మాత్రమే పరిమితం చేయబడినవి.

నియమింపబడిన సంగతులు ఆజ్ఞలుగా పరిశుద్ధ పరచబడినవి. మార్కు 2 : 27. "విశ్రాంతి దినమును పరిశుద్ధముగా ఆచరించుట" విధిరూపకమైన ధర్మశాస్త్రం (ceremonial Law) లో ఒక భాగము, ఆజ్ఞ (నిర్గమ 20 : 8).

ధర్మశాస్త్ర మంతయు సిలువకు మేకులతో కొట్టబడెను. (ఎఫె 2:11-16; కొలస్స 2:14-17; హెబ్రీ 10:9; రోమా 6:14; రోమా 7:1-7; గలతీ 3:23-25; హెబ్రీ 7:11-12). విధిరూపకమైన ధర్మశాస్త్రం మాత్రమే కాదు.

అభ్యంతరం 6 : పది ఆజ్ఞలకు విధేయులు కావలెనని యాకోబు బోధించెను. "మెట్టుకు నీవలె నీ పొరుగువాని ప్రేమించవలెను" లేఖనములో ఉన్నట్టి ప్రాముఖ్యమైన యీ ఆజ్ఞను మీరు నెరవేర్చినయెడల బాగుగనే ప్రవర్తించు వారగుదురు. ఎవడైనను ధర్మశాస్త్రమంతయు గైకొనియు, ఒక ఆజ్ఞ విషయములో తప్పిపోయినయెడల, ఆజ్ఞ లన్నిటి విషయములో అపరాధి యగును. వ్యభిచరింపవద్దని చెప్పినవాడు నరహత్య చేయవద్దనియు చెప్పెను. గనుక నీవు వ్యభిచరింపకపోయినను నరహత్య చేసినయెడల ధర్మశాస్త్ర విషయములో నపరాధివైతివి" (యాకో 2:8-11).

ఈ లేఖనము పాతనిబంధనకు విధేయులు కావాలని బోధించుట లేదు." ఈ ప్రాముఖ్యమైన చట్టము" పది ఆజ్ఞలు కాదు. "స్వాతంత్ర్యము నిచ్చు సంపూర్ణమైన సమయము"లో తేరిచూచి నిలకడగా యుండుటయే క్రీస్తు మరణము తరువాత మానవుల కివ్వబడిన చట్టము. యాకో 1:25. "ప్రాముఖ్యమైన ఆజ్ఞ" అను ఈ మాట యాకోబు, లేవీ 19:18 నుండి మనకు జ్ఞాపకముచేసి ఇది దృష్టాంతముగా మనకు తీర్పుతీర్చు క్రీస్తు నువార్తకు క్రొత్తనిబంధనకు మనము విధేయత చూపవలసిన ప్రాముఖ్యతను యాకోబు మనకు గుర్తుచేసెను. "స్వాతంత్ర్యము

ఇచ్చు నియమముచొప్పున తీర్పు పొందబోవు వారికి తగినట్టుగా మాటలాడి, ఆలాగుననే ప్రవర్తించుడి" (యాకోబు 2:12). అపొస్తలుడు చెప్పిన ఆజ్ఞలు స్వాతంత్ర్యము నిచ్చు సంపూర్ణమైన నియమము నుండియే. "సబ్బాతును జ్ఞాపకముంచుకొనుము" నే ఆజ్ఞ "సంపూర్ణ నియమము"లో భాగము కాదు.

అభ్యంతరం 7 : కాన్‌స్టాంటిన్ చక్రవర్తి క్రీ॥శ 321లో తన అధికారముచేత సబ్బాతు దినాన్ని అనగా శనివారాన్ని, ఆదివారం ఆరాధనా దినంగా మార్చెను.

ఈ బోధ క్రొత్తనిబంధన బోధను అగౌరవపర్చేదిగా యున్నది. కాన్‌స్టాంటిన్ పుట్టక 300 సంవత్సరముల ముందే ఆదివారం ఆరాధనా దినంగా బయలుపర్చబడినది (అపొ. కా. 20:7; 1 కొరిం16:1; ప్రక 1:10).

అభ్యంతరం 8 : పది ఆజ్ఞలలో "సబ్బాతును పరిశుద్ధముగా ఆచరించుట" అను ఆజ్ఞ నేడు అమలులో లేకపోయినయెడల మిగిలిన ఆజ్ఞలుకూడ అమలులో ఉండవు.

ఈ అభ్యంతరము క్రొత్త నిబంధన చట్టాన్ని అపార్థముచేసికొనుట వలన ఉత్పన్నమైనదే. "సబ్బాతును ఆచరించుట" తప్ప మిగిలిన ఆజ్ఞలన్నియు క్రొత్తనిబంధనలో చేర్చబడినవి. పరిశీలిద్దాం. ఉదాహరణకు:

1. మొదటి నిబంధన : "నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు" నిర్గ 20:3.

క్రొత్త నిబంధన : "మీరు వ్యర్థమైన వాటిని విడిచిపెట్టి ఆకాశమును భూమిని సముద్రమును వాటిలో ఉండు సమస్తమును సృజించిన జీవముగల దేవునివైపు తిరుగవలెనని మీకు సువార్త ప్రకటించుచున్నాము" (అపొ. కా. 14:15).

"దేవతలనబడిన వారును ప్రభువులనబడిన వారును అనేకు లున్నారు. ఆకాశమందైనను భూమిమీదనైనను దేవతలనబడినవి యున్నను మనకు ఒక్కడే దేవుడున్నాడు. ఆయన తండ్రి. ఆయనమండి సమస్తమును కలిగెను. ఆయన నిమిత్తము మనమున్నాము. మరియు మనకు ప్రభువు ఒక్కడే ఆయన యేసుక్రీస్తు. ఆయనద్వారా సమస్తమును కలిగెను. మనము ఆయనద్వారా కలిగినవారము" (1 కొరి. 8 : 5-6).

2. మొదటి నిబంధన : "దేని రూపమునైనను విగ్రహమయినను నీవు చేసికొనకూడదు. వాటికి సాగిలపడకూడదు. వాటిని పూజింపకూడదు" (నిర్గ 20:4).

క్రొత్త నిబంధన : "చిన్నపిల్లలారా, విగ్రహముల జోలికి పోకుండ జాగ్రత్తగా ఉండుడి" (1 యోహా 5:21). "లోకమందు విగ్రహము వట్టిదనియు, ఒక్కడే దేవుడు తప్ప వేరొక దేవుడు లేడనియు ఎరుగుదుము" (1 కొరి. 8:4).

3. మొదటి నిబంధన : "నీ దేవుడైన యెహోవా నామమును వ్యర్థముగా నుచ్చరింపకూడదు" (నిర్గ 20:7).

"నా సహోదరులారా, ముఖ్యమైన సంగతి ఏదనగా ఆకాశముతోడనిగాని భూమితోడనిగాని మరి దేనితోడనిగాని ఒట్టు పెట్టుకొనక, మీరు తీర్పుపాలు కాకుండునట్లు అవునంటే అవును కాదంటే కాదు అని ఉండవలెను" (యాకో 5:12). "మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతి మాటను గూర్చియు విమర్శదినమున లెక్క చెప్పవలసి యుండును. నీ మాటలనుబట్టి నీతిమంతుడవని తీర్పు నొందుదువు. నీ మాటలను బట్టి యే అపరాధివని తీర్పు నొందుదువు" (మత్త 12:36-37).

4. మొదటి నిబంధన : "విశ్రాంతి దినమును పరిశుద్ధముగా ఆచరించుకొనుటకు జ్ఞాపకముంచుకొనుము" (నిర్గ 20:8).

క్రొత్త నిబంధన: సబ్బాతును ఆచరించాలని క్రొత్త నిబంధన చట్టంలో ఒక ఆజ్ఞగాని మాదిరిగాని లేదు. ఈ ఆజ్ఞ క్రీస్తు క్రొత్త నిబంధనలోనుండి పూర్తిగా తీసివేయబడినది. ప్రభువు దినము అనగా ఆదివారము ఆచరించుటకు ఇవ్వబడెను (అపో. కా. 20:7).

5. మొదటి నిబంధన: "నీవు దీర్ఘాయుష్మంతుడవగునట్లు నీ తండ్రిని నీ తల్లిని సన్మానింపుము" (నిర్గ 20:12).

క్రొత్త నిబంధన: "పిల్లలారా, ప్రభువునందు మీ తలిదండ్రులకు విధేయులై యుండుడి. ఇది ధర్మమే" (ఎఫె 6:1).

6. మొదటి నిబంధన: "నరహత్య చేయకూడదు" (నిర్గ 20:13).

క్రొత్త నిబంధన: "మీలో ఎవడును నరహంతకుడుగా గాని... బాధ అనుభవింప తగదు" (1 పేతు 4:15).

7. మొదటి నిబంధన: "వ్యభిచరింపకూడదు" (నిర్గ 20:14).

క్రొత్త నిబంధన: "మోసపోకుడి. జారులైనను విగ్రహారాధికులైనను వ్యభిచారులైనను . దేవుని రాజ్యమునకు వారసులు కానేరరు" (1 కొరింధి 6:9, 10).

8. మొదటి నిబంధన: "దొంగిలకూడదు" (నిర్గ 20:15).

క్రొత్త నిబంధన: "దొంగిలువాడు ఇకమీదట దొంగిలక అక్కరగలవానికి పంచిపెట్టుటకు వీలుకలుగు నిమిత్తము తన చేతులతో మంచిపని చేయుచు కష్టపడవలెను" (ఎఫెసీ 4:28).

9. మొదటి నిబంధన: "నీ పొరుగువానిమీద అబద్ధ సాక్ష్యము పలుకకూడదు" (నిర్గ 20:16).

క్రొత్త నిబంధన : "ఒకనితో ఒకడు అబద్ధమాడకుడి" (కొలస్స 3:9). "అబద్ధికు లందరును అగ్నిగంధకములతో మండు గుండములో పాలు పొందుదురు" (ప్రక 21:8).

10. మొదటి నిబంధన : "ఆశింపకూడదు".

క్రొత్త నిబంధన : "దొంగలైనను, లోభులైనను, త్రాగుబోతులైనను, దూషకులైనను, దోచుకొనువారైనను దేవుని రాజ్యమునకు వారసులు కానేరరు" (1 కొరి. 6:10).

"లోభత్వమేగాని, వీటి పేరైనను ఎత్తకూడదు. ఇదే పరిశుద్ధులకు తగినది" (ఎఫె 5:3).

క్రొత్త నిబంధన ఆజ్ఞలన్నియు ఆచరించవలసిన అవశ్యకత యున్నది. ఎందుకనగా అవి ఆచరింపవలెనని క్రీస్తు వాటిని క్రొత్త నిబంధన యందుంచెను. పది ఆజ్ఞలలో తొమ్మిది ఆజ్ఞలు క్రొత్త నిబంధనలో చేర్చబడెను. ఎందుకనగా అవి దైవికమైన నీతి సూత్రములు, న్యాయవిధులు, భక్తితో కూడినవై యున్నవి. "విశ్రాంతి దినము పరిశుద్ధముగా నాచరించవలె"నను ఆజ్ఞతోటి మానవుల మధ్యగాని మానవుడు, దేవుని మధ్యగాని సంబంధము కలిగిలేదు. అది ఐగుప్తు బానిసత్వమునుండి విడుదలకు గుర్తుగా దేవుడు ఇశ్రాయేలీయులకు ఇచ్చిన ఆజ్ఞ. ద్వితీ 5 : 15.

ఎల్లప్పుడు జ్ఞాపకముంచుకొన వలసిన విధి యొకటున్నది. "ధర్మశాస్త్రము చెప్పుచున్న వాటన్నిటిని ధర్మశాస్త్రమునకు లోనైన వారితో చెప్పుచున్నదని యెరుగుదుము" (రోమా 3:19). ధర్మశాస్త్రము యూదులకు మాత్రమే ఇవ్వబడెను. ఇది క్రీస్తునకు క్రొత్త నిబంధనకు ముందు వారికి ఇవ్వబడెను.

[సశేషం

పది ఆజ్ఞలు :

## అసత్యారాధన చేయరాదు

### ( *No False worship* )

యెహోవా దేవుడిచ్చిన పది యాజ్ఞలలో మొదటిది ఎవరిని ఆరాధించాలో తెలియ జేయుచున్నది. రెండో ఆజ్ఞ ఎట్లు ఆరాధించాలో తెలియ జేయుచున్నది. మొదటి ఆజ్ఞ అబద్ధ దేవుండ్లను నిషేధించుచుండగా రెండవ ఆజ్ఞ అసత్యారాధనను ఖండించుచున్నది. దేవుడిట్లు ఆజ్ఞాపించాడు: "పైన ఆకాశ మందేగాని క్రింది భూమి యందేగాని భూమి క్రింద నీళ్ల యందేగాని యుండు దేనిరూపము నయినను, విగ్రహము నయినను నీవు చేసికొనకూడదు; వాటికి సాగిల పడకూడదు వాటిని పూజింపకూడదు. ఏలయనగా నీ దేవుడనైన యెహోవానగు నేను రోషముగల దేవుడను; నన్ను ద్వేషించు వారి విషయములో మూడు నాలుగు తరములవరకు తండ్రుల దోషము కుమారుల మీదికి రప్పించుచు నన్ను ప్రేమించి నా ఆజ్ఞలు గైకొను వారిని వెయ్యితరముల వరకు కరుణించువాడనై యున్నాను" (నిర్గమ 20:4-6).

దేవుడు మానవునికి స్వభావసిద్ధమైన కొన్ని కోరికల నిచ్చాడు. ఆకలి దప్పికలు అతని భౌతిక కోరికలు. ప్రేమించుట, ద్వేషించుట అతని మానసిక లక్షణాలు. అట్లే దేవుని నారాధించుట యనునది మానవుని యొక్క బలమైన ఆత్మీయ లక్షణము. మానవుడు ఈ గంభీరమైన విశ్వాన్ని దర్శించి నప్పుడు దానిలో తాను ఒక నలుసువంటి వాడనని గ్రహించి తనకంటె గంభీరమైన, బలమైన, జ్ఞానియైన వాని సహవాసము కొరకు తహ తహ లాడతాడు. ఈ భావాలను భక్తుడైన దావీదు ఇట్లు వ్యక్తపర్చుచున్నాడు : "నీచేతిపనియైన నీ ఆకాశములను నీవు కలుగ జేసిన చంద్ర నక్షత్రములను నేను చూడగా నీవు మనుష్యుని జ్ఞాపకము చేసికొనుటకు వాడే పాటివాడు ?". ఆదిమ గ్రీకులు మానవునికున్న ఈ ఆంతరంగిక భావాలను గ్రహించి మాన

వుని Anthropos అని పిలిచారు, అంటే మానవుడు ఉన్నత దృష్టి కలవాడని వారి అభిప్రాయము. అందువలన మనం ఏ దేశమెళ్ళినా, ప్రపంచములో ఏ మూలకు వెళ్ళినా, మానవుడు ఎక్కడ ఉన్నా సరే, అతడు నాగరికత కలవాడైనను అనాగరికుడైనను సరే ఏదో ఒక మూర్తిని దేవుడని ఆరాధించుట చూస్తాము. అయితే మానవుని ఈ ఆరాధన నిత్య సత్య దేవునికి చేయబడాలి, అది సత్యారాధనయై యుండాలని యెహోవా ఆజ్ఞాపించుచున్నాడు.

ప్రకటన గ్రంథములో యోహాను తనకు త్వరలో జరుగబోవు సంగతులను బయలు పరచిన దేవదూతను ఆరాధింప యత్నించాడు. అయితే ఆ దూత "వద్దు సుమీ, నేను నీతోను, ప్రవక్తలైన నీ సహోదరులతోను సహదాసుడను; దేవునికే నమస్కారము (ఆరాధన) చేయుమని" చెప్పాడు (ప్రక 22 : 9). ఏదో ఒకదానిని, లేక ఎవరినో ఒకరిని ఆరాధించాలనే కోరిక మానవునిలో యున్నదని ఎరిగిన వాడై దేవుడు నేను తప్ప వేరొక దేవుడులేడు, నీవు ఏ స్వరూపాన్ని విగ్రహాన్ని ఆరాధించరాదని ఆజ్ఞాపించాడు.

కొందరు ఆయా స్వరూపాలను నిర్మించుకొని వాటిని దేవుండ్లని పూజిస్తారు. వాటిని గూర్చి బైబిలు ఇట్లు చెప్పుచున్నది : "అన్యజనుల విగ్రహములు వెండి బంగారువి. అవి మనుష్యుల చేతి పనులు. వాటికి నోరుండియు పలుకవు, కన్నులుండియు చూడవు, చెవులుండియు వినవు, ముక్కులుండియు వాసన చూడవు, చేతులుండియు ముట్టుకొనవు, పాదములుండియు నడువవు, గొంతుకతో మాటలాడవు. వాటిని చేయువారును వాటియందు నమ్మిక యుంచు వారందరును వాటివంటివారై యున్నారు" (కీర్త 115 : 4-8). దేవుడు మానవునికి దూరముగా ఎక్కడో యుంటాడు గనుక తాము చేసికొన్న ప్రతిమలు దేవుని వారికి దగ్గరగా తీసుకొస్తాయని కొందరి విశ్వాసము. అయితే అది సత్యము కాదు. యేసుప్రభువు "ఇద్దరు ముగ్గురు నా నామమున

ఎక్కడ కూడియుందురో అక్కడ నేను వారి మధ్యన ఉందునని" చెప్పాడు (మత్త 18 : 20). "ఆయన మనలో ఎవనికిని దూరముగా ఉండువాడు కాడు" అని అపొ. పౌలు చెప్పాడు (అపొ.కా. 17 : 27).

"ఎవడును ఎప్పుడైనను దేవుని చూడలేదు; తండ్రి రొమ్మున నున్న అద్వితీయ కుమారుడే ఆయనను బయలుపరచెను" అని క్రొత్త నిబంధన బోధించుచున్నది (యోహాను 1 : 18). దేవుని ఏ మానవుడు ఎన్నడు చూడలేదు. సరిగదా "దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధింపవలెనని" యేసు ప్రభువు బోధించాడు (యోహాను 4 : 24). ఇది దేవుని తత్వము. ఆయన భౌతిక కాయుడు కాదు. ఆయన ఆత్మయై యున్నాడు. ఆత్మకు శరీరము, యెముకలు, మాంసము ఉండవు (లూకా 24 : 39). గనుక దేవుని స్థానే ఒక స్వరూపాన్ని చేసికొని దానినే మనం ఆరాధించరాదని యాజ్ఞాపించబడినది.

దేవుడు అనంతమైనవాడు. ఆయనను మనమొక స్వరూపానికి మల్చి మితము చేయలేము. ఆయనను ఒకచోట నెలకొల్పి ఆ చోటికే పరిమితము చేయులేము. "యెహోవా కన్నులు ప్రతి స్థలము మీద నుండును. చెడ్డవారిని మంచివారిని అవి చూచుచుండును" అని బైబిలు బోధించుచున్నది (సామె 15:3). "జగత్తును అందలి సమస్తమును నిర్మించిన దేవుడు తానే ఆకాశమునకును భూమికిని ప్రభువై యున్నందున హస్తకృతములైన ఆలయములలో నివసింపడు; ఆయన అందరికిని జీవమును ఊపిరిని దయచేయువాడని" అపొ. పౌలు గ్రీకు వేదాంతులకు బోధించాడు (అపొ.కా. 17:24, 25). దేవుడు సర్వాంతర్యామి!

దేవుడు అదృశ్యుడు; "సమీపింపరాని తేజస్సులో ఆయన మాత్రమే వసించు అమరత్వము గలవాడు. మనుష్యులలో ఎవడును చూడనేరడు" అని బైబిలు బోధించుచున్నది (1 తిమో 6:16). ఈ

అదృశ్య దేవుని స్వరూపం ఎట్టిదో ఏ మానవుడు ఎరుగడు. అట్లయిన ప్పుడు ఈ అదృశ్యుడైన దేవునికి ఒక స్వరూపాన్ని మనమెట్లు కల్పించ గలము? అది అసాధ్యము. అందుకే "పైన ఆకాశమందేగాని క్రింది భూమియందేగాని భూమిక్రింద నీళ్ళయందేగాని యుండు దేని రూపము నయినను విగ్రహము నయినను నీవు చేసికొన కూడదని" దేవుడు తన ప్రజలకు ఆజ్ఞాపించాడు.

దేవుని తత్వాన్ని మానవులు సరిగ అర్థము చేసికొనక పోవుట వలన మానవుని ఊహను బట్టి ఆయనకు మానవాకారము ఆపాదిం చుట యుక్తముకాదు. దేవుడు మనలను సృజించాడు గాని ఆయనను మనము సృజించలేము. "నేను కేవలము నీవంటివాడనని నీ వనుకొంటివి" యని దా. కీర్తన 50:21లో దేవుడు చెప్పుచున్నాడు. ఆయన మాన వునివంటివాడు కాదు. దేవుడు మానవుని స్వరూపాన్ని బట్టి చేయబడ లేదు గాని మానవుని దేవుడు తన స్వరూపమందు చేసాడు (ఆది 1 : 26, 27).

ప్రతిమారాధనను క్రొత్త నిబంధన నిషేధించుచున్నది. దేవుని వైపు తిరిగినవారు "విగ్రహ సంబంధమైన అపవిత్రతను, జారత్వమును గొంతు పిసికి చంపిన దానిని రక్తమును విసర్జించవలెనని" చెప్పబడినది (అపొ. కా. 15:20). మనము అక్షయుడగు దేవుని మహిమను క్షయ మగు మనుష్యుల యొక్కయు పక్షుల యొక్కయు చతుష్పాద జంతు వుల యొక్కయు పురుగుల యొక్కయు ప్రతిమా స్వరూపముగా మార్చరాదని రోమా 1:23 బోధించుచున్నది.

మిత్రులారా, దేవుడు రోషముగల దేవుడు, ఆయనను ద్వేషించువారి విషయములో మూడు నాలుగు తరములవరకు తండ్రుల దోషమును కుమారుల మీదికి రప్పించును. ఆయనను ప్రేమించి ఆయన ఆజ్ఞలను గైకొనువారిని వెయ్యి తరములవరకు కరుణించును (నిర్గ 20:5, 6).

ఈ నిత్య సత్యదేవుని బయలు పరచడానికే యేసుక్రీస్తు ఈ లోకానికి వచ్చాడు. ఆయనయందు విశ్వాసముంచి పాపముల విషయమై మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిన వారిని కరుణించును, తన సంఘముతో చేర్చుకొనును. నీ వాయనను సేవించుచున్నావా?

— జాషువా గూటం.

---

## అందరికి ఆహ్వానము

### ( *An invitation to all* )

—జె.సి. బెయిలీ.

యేసు ఈ భూమిపై నున్నపుడు యిట్లనెను : "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి. నేను మీకు విశ్రాంతి కలుగజేతును. నేను సాత్వికుడను దీనమనస్సు గలవాడను గనుక మీ మీద నా కాడి ఎత్తికొని నా యొద్ద నేర్చుకొనుడి. అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరకును. ఏలయనగా నా కాడి సుళువుగాను నా భారము తేలికగాను ఉన్నది" (మత్త 11:28-30). "సృష్టి యావత్తు ఇది వరకు ఏకగ్రీవముగా మూలుగుచు ప్రసవవేదన పడుచున్నదని యెరుగుదుమని పౌలు వ్రాయుచున్నాడు" (రోమా 8:22).

ఈ మాటలు 1900 సం॥ల క్రితము వ్రాయబడినవైనను అవి నాడు నేడుగూడ సత్యమే. భూమిపైగల సమస్త జనములలోను అవి సత్యములై యున్నవి. ప్రసవము ఎంత ప్రయాసతో కూడినదో మన మెరుగుదుము. అయినప్పటికి ప్రతి నిమిషము అనేక మంది శిశువులు

జన్మించుచున్నారు. కావున ప్రసవ ప్రయాస యనునది ఎల్లప్పుడు నుండును. ఈ భూమిపై జన్మించిన ప్రతి 6 గురు శిశువులలోను 5 గురు మరణించుచున్నారు. అయినను మానవని ఈ వేదనను గూర్చి మన మెప్పుడును ఆలోచించము.

## అందరు మరణింతురు

కొన్ని వ్యాధులను జయించుట (నిరోధించుట) చే మరణమును వెనుకకు నెట్టవచ్చును. అయినను మరణము అందరికి సంప్రాప్తమగును. గనుక దానినుండి ఎవరును తప్పింపబడరు. మనము కొన్ని వ్యాధులను జయించినపుడు మరికొన్ని క్రొత్త వ్యాధులు పుట్టుచున్నవి. పొగాకు, మద్యము, మత్తుమందుల వలన అనేక లక్షలమంది మరణించుచున్నారు అంతేగాక ఈ మధ్యకాలములో పాపము ప్రబలుటచే ఎయిడ్స్ అను భయంకరవ్యాధి కనేకులు గురి యగుచున్నారు. అక్రమ లైంగిక సంబంధములు కలిగియుండుటచే ఈ వ్యాధి సంభవించుచున్నది. పవిత్రమైన జీవితము జీవించుట తప్ప ఇంతవరకు దీనికి పరిష్కార మార్గమేది కనుగొనబడలేదు. అయితే మానవులు ఈ అపవిత్రమైన లైంగిక పాపములో జీవించుచు వైద్యశాస్త్ర నిపుణులు దీనికొరకు పరిష్కార మార్గము కనుగొనవలెనని వారు కోరుచున్నారు. అవును, మనము పొగ త్రాగవచ్చు, మద్యము సేవింపవచ్చు, మత్తుమందులు తీసికొనవచ్చు, అపవిత్రమైన లైంగిక జీవితము జీవింపవచ్చు. అయితే సత్యము సమస్తమును దృష్టించుచున్నది. "విశ్వాస ఘాతకుల మార్గము కష్టము" (సామెతలు 13:15). మనము స్వనీతిపరులముగా నుండలేము. ఎందుకనంటే మన మందరము పాపులము. ఏలయనగా అందరు పాపముచేసి దేవు డనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు (రోమా 3:23). పాపమువలన వచ్చు జీతము మరణము (రోమా 6:23). శిశువులుగూడ మరణింతురు. గాని వారు పాపము

చేయునివారు. ఆ సంగతి చెప్పుచున్న దైవగ్రంథము సత్యమైయున్నది. "ఏలయనగా మనుష్యులందరు ఒక్కసారే మృతి పొందవలెనని నియమింపబడెను" (హెబ్రీ 9:27). పసిపిల్లలు పుట్టుకతోనే పాపులని కొందరు చెప్పుదురు. అది అసాధ్యము. పాపము అనగా మనము చేయునది (యోహాను 8:34; 1 యోహాను 3:4). పాపము చేసే ముందు అది ఎట్లు చేయాలో మన మెరిగి యుండాలి (యాకోబు 4:17). ఇంకను యిట్లు చూడగలము." పాపము చేయువాడే మరణము నొందును; తండ్రి యొక్క దోషశిక్షను కుమారుడు మోయుటలేదని కుమారుని దోషశిక్షను తండ్రి మోయడు. నీతిపరుని నీతి ఆ నీతిపరునికే చెందును, దుష్టుని దుష్టత్వము ఆ దుష్టునికే చెందును" (యెహెజ్కేలు 18:20). పాపము ఈ లోకములోనికి ప్రవేశించినపుడు మరణముగూడ ప్రవేశించెను (రోమా 5:17). పాపము లోకములోనికి ప్రవేశించుటను గూర్చి చెప్పవలసిన అవసరములేదు. ఏలయనగా ఆ సంగతిని ప్రతి చోట స్పష్టముగా చూడగలము. మరణము ఈ లోకములో నున్నదని యెరుగుదుము. పాపము ఈ లోకములో నున్నదనుటకు మనము చూచుచున్న మరణమే అందుకు గుర్తుగా యున్నది.

## దేవుడు అందరినీ ప్రేమించుచున్నాడు

అయితే యేసు మానవులకొరకేమి చేసెను? విశ్రాంతి ననుగ్రహింతునని ఆయన చెప్పినాడు. అంతకంటె అధికముగా ననుగ్రహింతునని వాగ్దానము చేసినాడు. "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడు నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3:16). దేవుడు లోకమును ప్రేమించెనను మాటలను గమనింపుము-శ్వేతజాతీయులను మాత్రమే ఆయన

ప్రేమింపలేదు. లోకమంతటిని ప్రేమించినాడు మనజాతి గాక మన విశ్వాసమే లెక్కింపదగును. విశ్వసించు వాడెవ్వడు నశింపడు. నమ్ము ప్రతివానికి రక్షణ నిచ్చుటకు సువార్త దేవుని శక్తియైయున్న దని మనము నేర్చుకొంటిమి (రోమా 1 : 16). సువార్త అనగా యేసు మరణసమాధి పునరుత్థానములను గూర్చిన సత్యములని కూడ మనము నేర్చుకొంటిమి (I కొరింథి 15 : 1-4). యేసు తన మరణము ద్వారా పాపపు మూల్యమును చెల్లించి తన పునరుత్థానమువలన మానవులను కూడ లేపగలనను వాగ్దానము చేసి పరలోకమునకు తిరిగి వెళ్ళక మునుపు యిచ్చిన సార్వజనికమగు గొప్ప ఆజ్ఞను నీవు గమనింపవలెనని కోరుచున్నాను. "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందిన వాడు రక్షింపబడును, నమ్మని వానికి శిక్ష విధింపబడును" (మార్కు 16 : 15, 16). ఇది సార్వజనికమని లూకా కూడ వ్రాసినాడు. "క్రీస్తు శ్రమపడి మూడవ దినమున మృతులలో నుండి లేచుననియు యెరుష లేము మొదలుకొని సమస్త జనములలో ఆయన పేరట మారు మనస్సును పాపక్షమాపణయు ప్రకటింపబడుననియు వ్రాయబడి యున్నది (లూకా 24 : 46-47). ఈ సందర్భమునే మత్తయి తన గ్రంథములో యిట్లు పేర్కొనినాడు : "అయితే యేసు వారియొద్దకు వచ్చి - పరలోకమందును భూమి మీదను నాకు సర్వాధికారమియ్య బడియున్నది. కాబట్టి మీరు వెళ్ళి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మని యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి" (మత్తయి 28 : 18-20). యేసు మరణమును జయించి

నందువలన ఆయన అధికారమును పొందెను (రోమా 1 : 4). ఆయన వాగ్దానములు రాబోవు జీవితమునకు మాత్రమేగాక ఇప్పటి జీవమునకును సరిపడియున్నవి." శరీరసంబంధమైన సాధకము కొంచెము మట్టుకే ప్రయోజనకరమగును గాని దైవభక్తి యిప్పటి జీవము విషయములోను రాబోవు జీవము విషయములోను వాగ్దానముతో కూడినదై నందున అది అన్ని విషయములలో ప్రయోజనకరమవును" (I తిమో 4 : 8) ... జీవము కలుగుటకును అది సమృద్ధిగా కలుగుటకును నేను వచ్చియున్నానని యేసు చెప్పెను. (యోహా 10 : 10). యేసు - నేనే మార్గమును, సత్యమును, జీవమును; నా ద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు. (యోహాను 14 : 6). ఈ దీవెనలన్నియు విశ్వాసము ద్వారా మనకు నిలిచియున్నవి, లోకమును జయించిన విజయము మన విశ్వాసమే (1 యోహాను 5 : 4). నేను ఆయననని మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపములోనే యుండి చనిపోవుదురని వారితో చెప్పెను (యోహా 8 : 24). అయినచో మనకు విశ్వాస మెట్లు కలుగును ? దేవుని వాక్యము వినుటవలన విశ్వాసము కలుగును (రోమా 10 : 17). దేవుడు తన కుమారుని ద్వారా మనతో మాటలాడెను (మత్తయి 17 : 5). యేసు 1900 సం॥ల క్రితమే ఈ లోకమును విడిచిపెట్టినాడు. అయినచో నేడు మనమెట్లు ఆయన మాటలను వినగలము ? "మరియు అనేకమైన యితర సూచక క్రియలను యేసు తన శిష్యుల యెదుట చేసెను; అవి యీ గ్రంథమందు వ్రాయబడి యుండలేదుగాని యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను" (యోహాను 20 : 30, 31).

[ సశేషం ]

# కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్
# గ్రేడ్యుయేషన్ దినము - రిపోర్టు

గత 20 సంవత్సరాలనుండి కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ అనేక మంది సువార్తికులను తయారు చేస్తూ ఆంధ్రరాష్ట్రములో క్రీస్తు సంఘములకున్న గొప్ప కొరతను తీర్చుచున్నదనుటలో అతిశయోక్తి లేదు. కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్‌లో పట్టభద్రులైన అనేకమంది ఇప్పుడు పలుచోట్ల సంఘ నాయకులుగాను, గంభీరోపన్యాసకులు గాను, ఉపదేశకులు గాను తయారయ్యారు.

1989వ సంవత్సరము ఏప్రియల్ 14వ తేదీన ఆరుగురు యౌవనస్థులు కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్‌లో పట్టభద్రులయ్యారు. ఆ దినమున రెండు సంవత్సరముల కోర్సును జయప్రదముగాను, అత్యుత్తమ శ్రేణిలోను ముగించిన M. P. మోజెస్ (గురజాల, గుంటూరు జిల్లా), T. సుధాకర్ బాబు (మైలవరం డామ్, కడపజిల్లా), N. క్రిస్టోఫర్, (బోరబండ, హైదరాబాద్), K. ఆనంద్ (పూడిమాడిలంక, తూ॥గో॥జిల్లా), K. కోటేశ్వరరావ్ (నూజెండ్లపల్లి, ప్రకాశం జిల్లా) మరియు P. భాస్కరరావ్ (గంటి, తూ॥ గో॥ జిల్లా) లకు స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ డైరక్టర్ Bro. నెహెమ్యా గూటంగారు డిప్లొమాలను ప్రదానము చేసారు.

పట్టభద్రులైన ఈ విద్యార్థులను స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ ఉపాధ్యాయులు Bro. B. విజయకుమార్, M. A. B. Ed. గారు సభకు పరిచయం చేసారు. ఈ సభలో పాడిన పాటలన్నిటినీ K S P ఉపాధ్యాయులు Bro. D. చిరంజీవి, M. Com. గారు నడిపించారు.

ఈ పట్టభద్ర ఉత్సవానికి Bro. B. రత్నం, గారు అధ్యక్షత వహించి సభకు ముందు, తదనంతరం కూడ చక్కటి హెచ్చరికల నిచ్చారు.

పట్టభద్రులై సువార్త సేవలో ముందడుగు వేయబోవుచున్న ఆరుగురు యౌవనస్థులను అభినందిస్తూ Bro. T. జ్ఞానానందంగారు ఫలాపేక్ష లేకుండా బోధకులు ప్రభువు పనిలో ముందుకు సాగిపోవాలని హెచ్చరించారు. అటు తరువాత K. G. కుమార్‌గారు కూడ సువార్తికులకు తగిన హెచ్చరిక లిచ్చారు. చివరిగా Bro. జాషువా

గూటంగారు ప్రభువు పనివారు తమలో యున్న క్రీస్తును ప్రతిబింబింప జేయాలని, ప్రభువుకొరకు జీవించాలని, నిర్భయముగా సత్యవాక్యాన్ని చాటాలనీ, సమయమందును అసమయమందును సువార్త ప్రకటించాలనీ హెచ్చరించారు.

ఈ ఉత్సవానికి విచ్చేసిన ముఖ్య అతిథులకు, అతిథులకు, సంఘ సభ్యులకు Bro. నెహెమ్యా గూటంగారు వందన సమర్పణ చేసారు. ఈ ఉత్సవము ఉదయం 10 గంటలకు Bro. K. సత్యనారాయణ (వరంగల్లు) గారి ప్రార్థనతో ఆరంభమై Bro. P. ఫిలేమోను (కాకినాడ-2) గారి ప్రార్థనతో 12 గంటలకు ముగిసినది.

క్రీస్తు సంఘసేవలో స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ ఇంకా ముందుకు సాగాలనీ, అపవాదికి అడ్డు బండగా, క్రీస్తుకు బలమైన స్తంభముగా ఈ సంస్థ అభివృద్ధి జెందాలనే ప్రార్థనలో మీరు మాతో ఏకీభవించు మని మా మనవి.

— సంపాదకులు.

Regd. No. H/KD—45/KD.M.O

From
SATYAWAKKU
P.O. Box. 80
KAKINADA-533 001

No.

To
..............................
..............................
..............................
..............................